# జవాబులేని ప్రశ్న

ఉత్తరం ఇచ్చి ప్రక్కవాటాకేసి నడిచాడు పోస్ట్‌మాన్. అదెక్కణ్ణించీ వచ్చిందో తెలుస్తూనే ఉంది- దస్తూరిని బట్టి భాస్కరం రాశాడు.

పరంధామయ్యకు మూడో కొడుకు రాసేదేమిటో బాగా తెలుసు. అందుకనే ఉత్తరాన్ని చదువుదామనే ఉత్సాహంగానీ ఉత్సుకతగానీ కలుగలేదు. ఆ ఇన్‌లాండ్ లెటర్‌ని టేబుల్‌మీద పడేశాడు.

పరంధామయ్యకు పక్కవాటాలో ఉన్న పంకజం గుర్తుకొచ్చింది.

పంకజంకి రోజూ వుత్తరం వస్తుంది-అయితే, ఇన్‌లాండ్ లెటరూ లేదా కవరూ. రోజూ ఆవిడ వుత్తరం కోసం నిరీక్షిస్తూ వుంటుంది. పది, పదిన్నరకల్లా పోస్ట్‌మన్ ప్రత్యక్షమవుతాడు. ఉత్తరం అందుకుంటున్న పంకజం కళ్ళలో వేయి పంకజాలు విరుస్తూ వుంటాయి.

ఉత్తరాల బట్వాడాకు సెలవయితే తప్ప-మిగతారోజుల్లో తప్పని సరిగా నెలకు ఇరవై రోజులు పంకజానికి ఉత్తరం వస్తుంది.

పంకజం వాళ్ళాయన ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తాడు. ఆ కారణాన నెలకు ఇరవై రోజులు టూర్లో వుంటాడు. ఆ ఇరవై రోజులూ పంకజానికి ప్రతిరోజూ అతనినుంచీ ఉత్తరం వస్తూ వుంటుంది.

ఇవ్వాళా పంకజానికి ఉత్తరం ఇచ్చి వెళ్ళేడు పోస్ట్‌మాన్.

ఒకసారి పరంధామయ్య భార్య-రమాదేవి అన్నది, "అంత రోజూ

రాసుకునే విషయాలేం వుంటాయో" అని. పరంధామయ్య భార్య వైపు చురుగ్గా చూసి, "నలభయ్యేళ్ళు వెనక్కి నడిచి చూడు. నీకూ అర్థమౌతుంది" అన్నాడు. రమాదేవి సిగ్గుతో ముడుచుకుపోతూ, 'చాల్లెండి సంబరం' అని లేచి వెళ్ళిపోయింది.

అవును. నలభయ్యేళ్ళ క్రితం సమాజం ఇలా ఉండేదికాదు. అయినా ఆ రోజుల్లోనే తనూ రమాదేవి ప్రేమలేఖలు వ్రాసుకునేవారు.

ఇద్దరి ఇళ్ళూ ఒకే వూళ్ళో-కావడాన, ఆ లేఖలు పోస్టులో వచ్చేవి కావు. కాంపౌండు గోడకి ఓ మూలగా వున్న గూట్లో తను వుత్తరం వుంచితే-మర్నాడు అక్కడే తను రాసిన వుత్తరాన్ని అట్టేపెట్టేది రమాదేవి. ఏం వుండేవి ఆ వుత్తరాల్లో? స్వీట్ నథింగ్స్!!

పరంధామయ్య పెదవుల మీద సన్నని నవ్వు విరిసింది.

అలాగే, పంకజం-ఆమె భర్త ప్రభాకర్రావ్- స్వీట్ నథింగ్స్ రాసుకుంటూ వుంటారేమో? మొన్నీ మధ్య రమాదేవి మరోమాట అన్నది- "పెళ్ళయి పన్నెండేళ్ళయిందట. ఆ పంకజం కడుపున ఓ కాయ లేదింకా. ఉత్తరాలేమో జోరుగానే సాగుతూ వుంటై."

తను ఫక్కున నవ్వేశాడు. రమాదేవి విస్తుపోయి చూచింది.

"పిచ్చిమొద్దూ. నేను కాకినాడలో ఉంటూండగా వోసారి నువ్ మీ అన్నయ్యగారింటికి నెల్లూర్ వెళ్ళావ్. గుర్తుంది కదూ, అప్పుడేం జరిగింది. నేను నీకో ఉత్తరం రాశాను-డియర్ లవ్-అని సంబోధిస్తూ. ఆ వుత్తరాన్ని మన పెద్దమ్మాయ్ శ్యామల చూసిందనీ, "ఏవిటమ్మా, నాన్నింకా లవ్‌గివ్ అంటూ రాస్తాడు" అని ఏన్నో పరిహాసం చేసిందనీ, పద్దెనిమిదేళ్ళ కూతురు చూస్తుందని కొంచెమన్నా ఆలోచనలేదని-నన్ను కోపగించుకుంటూ రాశావ్ నువ్వు. నేనది చదివి నీకు మళ్ళీ జవాబు రాశాను. మనస్సుకీ, వయస్సుకీ సంబంధంలేదనీ, ఎంత పెద్ద పిల్లలున్నా మొగుడికి పెళ్ళాం 'లవ్'

అనే సంగతి మరచిపోకూడదనీనూ, ఆ ఉత్తరాన్ని కూడా శ్యామల చూసే ట్టుగా పడెయ్యమని రాశాను-గుర్తులేదూ. అట్టాగే పంకజంకి పిల్లలు లేక పోవడానికి, ఆ భార్యా భర్తల మధ ఉత్తరాలు నడవడానికి ఏదో అవినా భావ సంబంధము వుండాలని కోరుకోవడం భావ్యంకాదు" అంటూ వో లెక్చ రిచ్చాడు తను. అప్పుడు రమాదేవి గర్వంగా తన కళ్ళలోకి చూసిన చూపులో ఎన్ని వసంతాలు జాలువారలేదు గనుక!

పరంధామయ్యకి-ఆనందకరమైన ఈ స్మృతులన్నీ ఆహ్లాదాన్నిచ్చి-మనసు పూంతోటల్లో విహరింపజేయసాగాయి.

'మధురం మధురం-ఈ రసమయం'-అని సినిమా పాటను చాలా హుషారుగా పాడుకోసాగేడు.

వంటింట్లో నుంచి రమాదేవి వచ్చింది. వస్తూనే అడిగింది: "ఉత్త రం ఎక్కణ్ణుంచీ."

"కుమార రత్నం నుంచి!" వెటకారంగా అన్నాడు పరంధామయ్య.

"చంద్రం రాశాడా-కోడలు వట్టిమనిషి కూడాకాదు-ఆరోగ్యాలు అవీ బాగున్నాయిటా?" రమాదేవి కుర్చీలో కూర్చుంటూ అడిగింది. ఆమెకళ్ళలో కొడుకు సంసార పరిస్థితులన్నీ మెదులుతున్నట్టు తెలుస్తూనే ఉంది పరం ధామయ్యకి.

చంద్రం ఎలిమెంటరీ స్కూలు టీచరు. ఐదొందలు గడపవున్న సిరి పురంలో కాపురం. కూనాగుజ్జూ నలుగురు సంతానం. వచ్చే నాలుగురాళ్ళు అంతమంది నాలుగువేళ్ళని నోట్లోకి పోనీవు. ఆడపాదడపా తండ్రి సహా యంకోసం రాస్తూ వుంటాడు చంద్రం.

చంద్రం భార్య అయిదోసారి నీళ్ళు పోసుకున్నట్టు తెలిసింది. పురిటికి డబ్బుకోసం ఇవ్వాళో, రేపో వుత్తరం వస్తుందని రాత్రి పరంధామయ్య, రమాదేవీ అనుకున్నారు.అందుకనే ఆ వుత్తరం చంద్రమే రాసి వుంటాడను

కుంది రమాదేవి.

"చంద్రం నుంచీ కాదు. భాస్కరరావ్ రాశాడు."

"ఏమిటట విశేషాలు?" అడిగింది రమాదేవి.

భార్యవైపు అదోలా చూసి, వుత్తరాన్ని చించేడు. పైకే చదవ సాగాడు.

"నాన్నగారూ...

మీరంతా కులాసా అనుకుంటున్నాను. నాకు హైదరాబాదు నుంచి పాల్వంచకు బదిలీ అయింది: వో వారంలో వెళ్ళి జాయిన్ కావాలి. ఇక్కడ చాలా చే బదుళ్ళు తీర్చివెళ్ళాలి. నాగది అద్దె నాలుగు వందలివ్వాలి. మా కంపెనీలో స్ట్రయికులూ, లాకవుట్లూ - గొడవల గురించి మీకు తెలును. వాటి కారణాన నేను బాగా అప్పుల్లో బడ్డాను. కనుక టి.యం.వో ద్వారా వో వెయ్యి రూపాయలు పంపండి..."

"జీతాలు లేకపోతే ఏం చేస్తాడు మరి" అంది రమాదేవి.

పరంధామయ్యకి కోపం వచ్చింది. "జీతం నెలకు ఆరొందల చొప్పున ఆరేళ్ళనుంచీ వస్తూనే వుంది. ఒంటిగంటి రామలింగంగాడు ఆ జీతమంతా ఏం చేసినట్టో? పైగా ఏడాదికోసారన్నా మనముందు చేయి చాస్తూనే వున్నాడు."

రమాదేవికి భర్త "మూడ్" అర్థమయింది. తనిక మాట్లాడటం మంచిది కాదని వూరుకుంది.

పరంధామయ్య భోజనానికి లేవబోతుండగా రాఘవ వచ్చాడు.

రాఘవ వచ్చాడంటే స్టంట్ సినిమాలో నేపథ్య సంగీతం వచ్చి నట్టు —

రాఘవ వచ్చాడంటే— దివిసీమలో ఉప్పెన వచ్చినట్టే:

పరామర్శలు అయిన తరువాత అసలు విషయం బయటపెట్టాడు

రాఘవ, "మీ కోడలి ఆఫీసు గొల్లపూడికి మార్చారు. నా ఆఫీసేమో బిసెంట్ రోడ్డులో. మేం వుండే యిల్లు మీకు తెలుసుగా ఐ.టి.ఐ. దగ్గర. బస్సుల్లో తిరగాలంటే టైమ్‌ప్రాబ్లెమ్. పిల్లలిద్దర్నీ తయారు చేసి కాన్వెంట్‌కు పంపించి, మేఁవిద్దరమూ నాలుగు ముద్దలు నోట్లో వేసుకుని అదరా బాదరా తయారయ్యేసరికి తొమ్మిదిన్నర దాటుతుంది. అప్పుడు బస్‌కోసం పరిగెత్తితే, ఆఫీసుకి రోజూ మధ్యాహ్నమే చేరతారు నేనూ అదీకూడా. అందుకని స్కూటర్ తీసుకోవాలనుకున్నాం. ఎనిమిది వేలవుతుంది. ఐదు వందలు కట్టి ఆర్డరిచ్చాం. ఇవ్వాళ వెహికిల్ వచ్చింది. తీసికెళ్ళమన్నాడు డీలర్— రాత్రి, వో అయిదువేలు సర్దాలి."

పరంధామయ్య ఏఁవీ మాట్లాడలేదు.

భోజనాల దగ్గర రమాదేవి తమ ఇబ్బందులేవో చెప్తుంటే, అసహనంగా విన్నాడు రాఘవ.

పరంధామయ్యకి నాలుగురోజుల క్రితం పెద్దకూతురు చేసిన కబురు గుర్తుకొచ్చింది.

శ్యామలా వాళ్ళు కూతురి పెళ్ళికి సంబంధం ఖాయం చేసుకున్నారట. పదివేలు కట్నం, "పెళ్ళి ఖర్చు ఎలాగోలా తంటాలు పడతాంగానీ, కట్నం సొమ్ములో నాలుగైదువేలు తక్కువౌతుంది. నువ్ సహాయం చేయక తప్పదు. మా పరిస్థితులు మీకు తెలుసుగా" అని సారాంశం.

"ఏఁవంటారో చెప్పలేదు" అడిగేడు రాఘవ.

"ఐదు వేలంటే కష్టమేరా - మీ అక్కకూతురి పెళ్ళికి డబ్బు కావాలంది. భాస్కరంకి బదిలీ అయిందట; డబ్బు కావాలిట. మీ పెద్దవదినెకి పురుడు వచ్చే రోజులంట. చంద్రానికి డబ్బు కావాలిట . . "

రాఘవకి ఉక్రోషం కట్టలు తెంచుకుంది. "అవున్లెండి. మీరేనాడు నా 'రెస్క్యూకి' వచ్చారు గనుక. అడగడం నాదే బుద్ధి తక్కువ. రజని

చెపుతూనే ఉంది— 'అడిగిలేదని పించుకోవద్దు. వెళ్ళొద్దు' అని. అవి వేకంగా నేనే పరిగెత్తు కొచ్చాను. ఒక కంట్లో బెల్లం, ఒక కంట్లో సున్నం..."

రాఘవ ధూముధాములు పరంధామయ్యకి కొత్తకాదు. రజని ఉద్యోగానికి నాలుగువేలు డిపాజిట్ కట్టాలని వచ్చినప్పుడూ ఇలాగే జరిగింది. చివరికి తీసుకునే వెళ్ళాడు—ఐదేళ్ళ క్రితం. ఆ డబ్బు తిరిగి రాలేదు. ఆ మాట గుర్తే ఉండదు.

రాఘవ వెళ్తున్నాననైనా చెప్పకుండా విసురుగా బయటికి నడవ సాగేడు.

గడపలో ఎదురైంది-కాలేజి నుంచి వస్తున్న వసంత.

"ఎప్పుడొచ్చావన్నయ్యా" అంటూ పలకరించింది. ఆమెని తప్పుకుని సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాడు రాఘవ.

జరిగినదంతా వసంతకి చెప్పి అన్నది రమాదేవి-"నిజంగానే అవసరంలో ఉన్నాడేమో ననిపిస్తుందే" అని.

భార్య మాటల్ని విన్నాడు ముందుగదిలో ఉన్న పరంధామయ్య. ఆయన దినపత్రిక చూస్తున్నాడు.

"అవును, అందరూ అవసరాల్లోనే ఉంటారు. నీకూ నాకే ఏ అవసరమూ లేదు"

భర్త మాటలకు రమాదేవి మరేమీ మాట్లాడలేదు.

ఆయన మనస్సు చుట్టూ ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకున్నై.

పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో మంచి ఉద్యోగమే చేసి రిటైరయ్యాడు. ఐదేళ్ళయింది. గుంటూరులో ఇల్లు కట్టుకుని స్థిరపడిపోయాడు. ప్రావిడెంట్

ఫండ్, ఇన్సూరెన్స్ సొమ్ముతో మిగిలిన దాన్ని భద్రం చేసుకుని కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. పిల్లలందరికీ-తన దగ్గర వేలకువేలు మూలుగుతున్నా యని, తమ అవసరాలకి తానాదుకోవాలని కోరిక. వసంత గురించి ఎవ్వ రికీ ఏ బాధ్యతా లేనట్టే ప్రవర్తిస్తారు. యింకా ఆ పిల్ల పెళ్ళి బాధ్యత తన కుంది. పైగా తననుంచి సహాయాన్ని పొందటం ఇంకా తమ హక్కుగానే భావిస్తారు. తల్లి తండ్రుల పట్ల తమ బాధ్యత మాత్రం గుర్తు రాదు. కనీ సం ఏ పండక్కో, పబ్బానికో నన్నా తమ ఇళ్ళకి పిలవరు. అయినా కన్న మమకారానికి తాను వాళ్ళ పట్ల నిక్కచ్చిగా మొండిచెయ్యి చూపే తత్వంతో ప్రవర్తింపలేకపోతున్నాడు. వున్నంతలోనే వాళ్ళ కోరికల్ని తీర్చాలని చూస్తున్నాడు కానీ....

"ఇవ్వాళ మార్క్సు షీట్ వచ్చింది."

వసంత మాటలకి ఈ లోకంలో పడ్డాడు పరంధామయ్య. కాగితాన్ని ఆయన చేతికిచ్చింది. చూసేడు. "బాగుంది, వెరీగుడ్..." మెచ్చుకోలుగా అన్నాడు.

"ఇంగ్లీషులో డెబ్బైరెండు వచ్చినై. థర్డ్ ఇయర్ కూడా ఇలాగే వస్తే, ఎమ్మేలో లిటరేచరే తీసుకోవచ్చు."

వసంతకేసి చూశాడు పరంధామయ్య.

భావి స్వప్నం ఆమెకళ్ళలో కాంతులీనుతోంది. "అలాగేలే" అని మంచంమీద వడుం వాల్చేడు.

ఆలోచనలతో అలసిపోయిన మస్తిష్కం విద్రవి వరించింది.

*　　*　　*

కాలింగ్ బెల్ మ్రోగడంతో పులిక్కిపడిలేచాడు పరంధామయ్య.

ఇంట్లో రమాదేవిగానీ, వసంతగానీ వున్న అలికిడి లేదు.

తలుపు తీసి వాకిట్లోకి వచ్చాడు. పోస్టుమెన్ కవరిచ్చి వెళ్ళిపోయాడు.

కవరు వెనక్కి తిప్పి చూశాడు. అదెక్కణ్ణించి వచ్చిందో అర్థమైందాయనకు. మంచం మీద కవరుపెట్టి టైం చూశాడు. నాలుగయింది. "వీళ్ళెక్కడికి వెళ్ళారో" మరోసారి అనుకున్నాడు.లోపలి తలుపులన్నీ వేసివున్నాయి. మంచం పక్కన టేబులు మీద మంచి నీళ్ళ చెంబు, ప్రక్కన బాక్సులో టిఫిను, ఫ్లాస్కులో కాఫీ వున్నాయి.

మధ్యాహ్నం నిద్రలేచాక తను ఏదో ఒకటి తినంది వుండలేడని రమకు తెలుసు. అందుకే సాధ్యమైనంత వరకూ రోజూ ఏదో ఒకటి చేసి వుంచుతుంది. తాను లేవగానే వెతుక్కోకుండా, తినడానికి వీలుగా,తాను బయటికి వెళ్ళేటప్పుడు ఇలా ఎదురుగా పెట్టి వెళ్తుంది. ఈ విషయం వసంతకూ తెలుసు. 'ఈ రోజు నాన్నగారికి తినడానికేం వుంది' అంటూ ముందు తానే సిద్ధం చేస్తుంది. రమ వూళ్ళో లేకపోయినా తన ఈ అలవాటుకు మాత్రం ఏ లోటూ రాదు.

దొడ్లోకి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చాడు పరంధామయ్య.

కాఫీ టిఫిన్లు సేవించాక నెమ్మదిగా కవరు విప్పాడు.ఆయనమొహం వివర్ణమయింది. తలతిప్పి టైము చూశాడు. 'బ్యాంకు టైమయిపోయిందే' చిన్నగా నిట్టూర్చాడు, మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

అప్రయత్నంగా ఈ రోజు శుక్రవారమని గుర్తుకొచ్చింది పరంధామయ్యకు.

రమాదేవి, వసంత, పంకజం ముగ్గురూ కలిసి తరుచుగా దుర్గాదేవి గుడికి వెళ్తుంటారు. ఆ మహాతల్లి అంటే రమాదేవికి ఎంతో గురి. అందుకే వీలైనప్పుడల్లా ఆ గుడికి వెళ్ళి వస్తూంటుంది. అందులో ముఖ్యంగా శుక్రవారం తప్పనిసరిగా వెళ్తుంది. ప్రొద్దుగూకితే జనం బాగా ఉంటారని మధ్యాహ్నం మూడింటికే బయల్దేరి వెళ్ళి నాలుగు దాటాక వచ్చేస్తారు. ఈ మధ్య పంకజానికీ అలవాటు చేసింది.అందుకనే ముగ్గురూ కలిసి వెళ్తున్నారు.

మూడింటికి తను నిద్రలో వుండగానే వెళ్తూ వుంటారు. వాళ్ళు తలుపు బయటి నుంచి వేసినా, లోపల గడియపడేటట్టు చేయించాడుతను. అందుకని వాళ్ళు తనకు నిద్రాభంగం కలిగించకుండా అలా వెళ్ళొచ్చి నప్పుడు, ఆ విధంగా వేసి వెళ్తారు. వాళ్ళు తిరిగి వచ్చేసరికి తానెటూ లేచే వుంటాడు.

పంకజం క్రమం తప్పకుండా గుడికి రావడానికి వొక కారణం చెప్పింది రమాదేవి.

దుర్గాదేవి గుడి చాలా చిన్నది. అయినా ఆ వాతావరణంలో కాసేపు కూర్చుంటే చాలు, మనశ్శాంతిగా ఉంటుందని రమాదేవి చాలాసార్లుచెప్పింది పరంధామయ్యతో.

దుర్గాదేవి గుళ్ళో రావిచెట్టు, వేపచెట్టు కలిసి వున్నాయి.వాటిచుట్టూ పెద్ద అరుగు కట్టారు. ఆ చెట్ల మొదట్లో ఓ పెద్ద రాయి వున్నది. దాన్ని చేత్తో ఎత్తి పట్టుకుని మగబిడ్డ కావాలో, ఆడబిడ్డ కావాలో కోరుకుంటూ క్రింద పెట్టాలి. మూడుసార్లు అలా ఎత్తి పట్టుకుని బిడ్డని కోరుకుంటూ క్రింద పెట్టడం చెయ్యాలి. నలభై వారాలు ఇలా చేస్తే తప్పకుండాపిల్లలు పుడ్తారని ఓ ప్రచారం వుంది. దాన్ని పూర్తిగా నమ్మింది రమాదేవి. పంకజాన్ని కూడా నమ్మించి దానికి చెయ్యాల్సిన విధులన్నీ పంకజంచేత చేయిస్తోంది రమాదేవి.

పంకజానికి పిల్లల మీదెంత మనసుందో వివరించడానికి గుడిసంగతంతా పరంధామయ్యతో చెప్పుకొచ్చిందొకసారి రమాదేవి. పంకజం వీటన్నిటినీ ఎంత ఇష్టంగా చేసేదీ వివరించి చెప్పింది.

పంకజానికి నిజంగా పిల్లలుపుడితే అదంతా దుర్గాదేవి మహిమేనని రమాదేవి ఎంత పొంగి పోతుందో అనే ఆలోచన కూడా చేస్తుంటాడు పరంధామయ్య.

పిల్లలు లేనివాళ్ళు పిల్లలకోసం పడే తాపత్రయం చూస్తుంటే బాధే స్తుంది పరంధామయ్యకు. పిల్లలు పుట్టాక ఎన్నిరకాల యాతనలకు తను గురయ్యాడు. ఎన్నెన్ని ఇబ్బందులెదుర్కొన్నాడు తను ? ఎన్ని బాధలు పడితే తన పిల్లలు ఇంత పైకి వచ్చారు. తనను మాత్రం ఈ విధంగా కూడా మనశ్శాంతిగా బతకనీయడం లేదు తన పిల్లలు.

పరంధామయ్యకు ప్రొద్దుటినుంచీ జరిగిన సంఘటనలన్నీ కళ్ళ ముందు మెదిలాయి.

రాఘవ ప్రవర్తన ఆయన మనస్సులో ముల్లులా గుచ్చుకుంది. దాని నుంచి తేరుకోకముందే ఇప్పుడీ ఉత్తరం. ఈ పరిస్థితులకు తానెంతవరకూ తట్టుకొని నిలబడగలడనేది— అర్థం కావటంలేదు.

గేటు చప్పుడు కావడంతో ఈ లోకంలో పడి, తల తిప్పి చూశాడు పరంధామయ్య. పంకజం, వసంత, రమాదేవి వస్తున్నారు. చేతిలో పూల బుట్టలలో కొబ్బరి చిప్పలు, అరటిపండ్లు, కుంకుమ అంటిన పూలు ఉన్నాయి.

వసంత లోపలి కొస్తూనే మంచం మీది వుత్తరం చేతిలోకి తీసు కుంది.

"ఎక్కణ్ణుంచే" లోపలికి వస్తూనే అడిగింది రమాదేవి.

"చిన్నక్క రాసిందే" మడత విప్పుతూ చెప్పింది వసంత.

"ఏం రాసిందే, పెద్దగా చదువు..." వంటింటి గడపకు చతికిల పడుతూ అన్నది రమాదేవి.

చదివింది వసంత. రమాదేవి ముఖంలో ఆందోళన చోటు చేసు కుంది. విటారుగా కూర్చుంటూ, "మళ్ళీ చదవ్వే" అన్నది.వసంత మొదలు పెట్టింది.

"ప్రియమైన నాన్నగారికి-మీరందరూ కులాసా అని తలుస్తాను. నిన్న ప్రొద్దున మీ అల్లుడుగారు కాలుజారి మెట్లమీంచి దొర్లిపడ్డారు. పడ్డ

మనిషి అసలు లేవలేకపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళాం. జాయిన్ చేసుకున్నారు. నడుము దగ్గర కీలేదో ప్రక్కకు తొలగిందట. ఓ నెలైనా ఆస్పత్రిలో వుండాల్సొస్తుందిట. నెప్పి బాగా ఎక్కువగా ఉండటాన చాలా బాధపడ్తున్నారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వలేదు. డబ్బుకు చాలా ఇబ్బందిగా వున్నది. మందులకు నిన్నట్నుంచీ ఇప్పటికి వందరూపాయల దాకా ఖర్చయింది. ఇంకెంత అయ్యేది తెలీదు. నాకు చాలా భయంగా వుంది. ఈ నెలంతా ఎలా గడుస్తుందోనని ఆందోళనంగా వుంది. కనుక వెంటనే ఓ వెయ్యిరూపాయలు టి.యం.ఓ. చెయ్యగలరు. మరో విషయం నేను ఆస్పత్రికి తిరుగుతుంటే ఇంట్లో పిల్లల్ని చూచుకోవడం కుదరటం లేదు. వీలయితే అమ్మను పంపగలరు. అమ్మ వచ్చే పక్షంలో డబ్బు కూడా అమ్మతోనే పంపండి. సమయానికి చేతిలో డబ్బులు లేకపోవడంచేత ఇలా వ్రాయాల్సి వచ్చింది. నా సంగతి మీకు తెలుసుకదా. నేను ఎంతో అవసరమయితే తప్ప వ్రాయనని-ఎదురుచూస్తూ-సావిత్రి"

రమాదేవికి కాలూ చెయ్యీ ఆడలేదు.

భర్తవేపు చూస్తే ఆయన మూర్తీభవించిన గాంభీర్యంగా కన్పించాడు.

*　　*　　*

"తాపీగా సాగాలనుకుంటే, సాఫీగా సాగనిది జీవితం" ఎవరో రాసింది సావిత్రి పట్ల నిజమైంది.

పరంధామయ్యకు ఇక ఆ అల్లుడు లేడు.

*　　*　　*

ఆరు నెలల తర్వాత—ఒకరోజు—

ఉత్తరం ఇచ్చి పక్క వాటాకేసి వడిచేడు పోస్ట్‌మాన్.

ఉత్తరం ఎక్కణ్ణుంచి వచ్చిందో తెలుస్తూనే వుంది-ఖాస్కరం

రాశాడు.

పరంధామయ్యకు పంకజం గుర్తు కొచ్చింది.

ఆమె ఇప్పుడు ప్రక్క వాటాలో లేదు.

నెలరోజుల క్రితం ప్రభాకరరావుకి విశాఖ బదిలీ అయింది. వెళ్ళే ముందు వాళ్ళకో పిడుగులాంటి వాస్తవం తెలిసింది. పంకజంకి సంతాన యోగం లేదని!

మనసులో పునాదులు కదిలినట్లైంది రమాదేవికి.

ఉత్తరంతీసి చదివేడు పరంధామయ్య.భాస్కరంకి డబ్బులు కావాలి-!

పంకజంవంటివాళ్ళు పిల్లలు కలుగకపోవడాన్ని శాపంగా భావిస్తారు-

మరి, తనలాంటి వాళ్ళు-

పుట్టుకే యాక్సిడెంట్ అనుకోవాలేమో !

పరంధామయ్య వేదాంతిలా నవ్వుకున్నాడు !!!

కథా నిలయం
1560
శ్రీకాకుళం